పాపంబుఁ-కాదె=పాపంబుఁగాదె?(6:586)

"బరిహరింపకయున్కి-పాపంబుఁగాదె?"

-కదమ్మ

వచ్చెఁ-కదమ్మ=వచ్చెఁగదమ్మ(2:7215)

"వచ్చెఁగదమ్మ జ-వ్వని కైక కొడుకు"

-కదయ్య

కాదు-కదయ్య=కాదుగదయ్య(2:951)

"ఆరీతిఁగాదు గ-దయ్య వల్లభులు"

## 5.7 సంబోధనార్థకం (vocative particle)

(i) సంబుద్యర్థంలో -అ/-ఆ, -అమ్మ/-అమ్మా అనే పదకల్పకావ్యయాలు కనిపిస్తున్నాయి.

-అ సుమ్ము-అ=సుమ్మ(2:765)

"భరతునికైనట్టి-పట్టంబెసుమ్మ!"

-ఆ

వినుము-ఆ=వినుమా(1:1147)

"మౌనినాయక! విను-మా! వనితలము"

-అమ్మ

చింతింపవు-అమ్మ=చింతింపవమ్మ(4:2073)

"సేయు కార్యంబులు-చింతింపవమ్మ"

-అమ్మా

వదలవు-అమ్మా=వదలవమ్మా(2:4646)

"వదలవమ్మా! యని-వాకొనుచుండ"

(ii) -రా/-అరా అనే పదకల్పకావ్యయాలు మహ దేకవచనంలోనూ, -ఏ/-అవే అనే పదకల్పకావ్యయాలు అమహదేకవచనంలోనూ వాడుక తెలుగులో కనిపిస్తాయి. వీటిలో -అరా, -అవేలు విధ్యర్థకనిర్ధారక (affirmative) ఏకవచన రూపాలమీద చేరతాయి. -రా/-ఏ లు ఇతర రూపాలపై చేరతాయి. వీటిని రామనరసింహం (1985:413, 414) మొదటిసారి చర్చించారు. ఇటువంటి పదకల్పకావ్యయాలు చేరిన ప్రయోగాలు శ్రీరామాయణంలో ఉన్నాయి.

-రా

ఏమి-రా=ఏమిరా!(6:2367)

"ఏమిరా!శుక!తెక్క-లేఁటికి విఱిగె"

-అరా

విను-అరా=వినరా(6:609, 6:1269)

"రాక్షసాధమ! విన-రా! కుంభకర్ణ!"

"రాక్షసాధమ! విన-రా! యింద్రజిత్తు"

-ఏ

ఏమి-ఏ=ఏమే(3:5244)

ఏ"(యే)మియుఁ దెలియక-యేమే!లతాంగి!"

సులభము-ఏ=సులభమే(6:21)

"చొచ్చిన మఱలిరా-సులభమే?"

-అవే

చూడు-అవే=చూడవే(6:1245)

"చూడవే సురదంతిఁ-జులకగాఁగదిసి"

## 5.8 కాలార్థకం (temporal)

-చోన్ అనే పదకల్పకావ్యయం కాలార్థంలో ప్రయుక్తమైన రూపాలు శ్రీరామాయణంలో ఉన్నాయి.

పోవు-చో(న్)=పోవుచో(న్)(5:1374)

"పొలుపున దినమణి-పోవుచో నిలుచు"

ఉండు-చో(న్)=ఉండుచో(న్)(3:5941)

"దానవుఁజూచు-చుండుచోనాఁడు"

***

# 6 వాక్య విజ్ఞానం (Syntax)

## 6.0 వాక్యం-నిర్వచనం

'యోగ్యత, ఆకాంక్షలుకలిగిఉండి, ఆసత్తితో కూడిన పద సముదాయా'న్ని వాక్యం అంటారు. (వాక్యము నా యోగ్యతాకాంక్షా సహితంబగు నర్థముగల యాసత్తి యుక్త పద సముదాయంబు" (చూ. ప్రౌఢవ్యా. వాక్య.:1)) యోగ్యత అంటే వాక్యంలోని పదాలు వాటి అర్థాల పరస్పర సంబంధంలో బాధ కలగకుండటం. ఆకాంక్ష అంటే వాక్యంలోని ఒక పదంయొక్క అర్థాన్ని గ్రహించిన తర్వాత తక్కిన పద, అర్థాలను తెలిసికోవాలనే కోరిక. ఆసత్తి అంటే వాక్యంలోని పదాలమధ్య ఉండే అవ్యవధానత.

వాక్యానికి పాశ్చాత్య భాషావేత్తలు ఇచ్చిన నిర్వచనాలు కిందివిధంగా ఉన్నాయి.

"A Sentence is a grammatical form which is not in construction with any other grammatical form; a constitute which is not a constituent."

(Hockett. 1970:1999)

'స్వరూపాన్నిబట్టి వాక్యం ఇతర విభాగాలకి చెందని ఒక ప్రత్యేక వ్యాకరణ వర్గానికి చెందింది. ఇది ఇతర వ్యాకరణ వర్గాలకు అంగంకాని అంగి'

"The largest linguistic unit which is held together by rigid grammatical rules is the sentence. More particularly, a sentence does not have to be something which somebody might reasonably say, and not everything that we might reasonably say is a sentence"

(Trask, 1999:273, 74)

'వ్యాకరణ సూత్రాలతో ఏర్పడే రూపాలు కలిసి నిర్మితమయ్యే గరిష్ఠ భాషాంశం వాక్యం. స్పష్టంగా/పూర్తిగా/ఇతమిద్ధంగా ఇది అని నిర్వచించలేని భాషాంశం వాక్యం.'

# 6.1 వాక్య భేదాలు

"వాక్యాలను ఏ భాషలోనైనా సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలుగా విభజించవచ్చు. ఒక వాక్యంలో నిర్దిష్ట స్థానంలో ఇంకొక వాక్యాన్ని చేరిస్తే సంశ్లిష్ట వాక్యం ఏర్పడుతుంది. ఒక వాక్యంతో ఇంకొక వాక్యాన్ని చేరిస్తే సంయుక్త వాక్యం ఏర్పడుతుంది. ఒక వాక్యంతో ఇంకొక వాక్యాన్ని చేర్చినప్పుడు కొన్ని మార్పులు జరుగుతై. ఈ మార్పుల అనంతరమే సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలు ప్రయోగార్హాలు అవుతై. ఈ దృష్టితో చూసినప్పుడు సంశ్లిష్ట, సంయుక్త వాక్యాల్లో సామాన్య వాక్య లక్షణాలుండటం ఆశ్చర్యం కాదు."

(రామారావు, 2002:1)

ఈ అధ్యయనంలో వాక్యాలను స్వరూప విభాగంలో సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలుగానూ, స్వభావ విభాగంలో ప్రశ్నార్థక, ఆశ్చర్యార్థక, ఉభయ సంప్రార్థన, సందేహార్థక, నిశ్చయార్థక, అనిశ్చయార్థక, సంబోధనార్థక, అవధారణ, నిర్ధారక వాక్యాలుగా విభజించి అనుశీలించడం జరిగింది.

# 6.2 స్వరూప విభాగం

## 6.2.1 సామాన్య వాక్యం (simple sentence)

సామాన్య వాక్యంలో ఒక ఆఖ్యాతం (predicate) ఉంటుంది. ఒక సమాపక క్రియ ఉంటుంది. సామాన్య వాక్యంలో అసమాపక క్రియ ఉండదు. సామాన్య వాక్యాల్లోని భేదాలను చర్చిస్తూ రామారావు (2002:1) "... సామాన్య వాక్యాల్లో అతి సామాన్యమైనదాన్ని నిశ్చయార్థకం అంటారు. సామాన్య వాక్యాన్ని కొన్ని మార్పులు చెయ్యటంద్వారా(ఆగమాదేశ వ్యత్యయాది కార్యాలు) వ్యతిరేక, ప్రశ్న- మొదలైన వాక్య భేదాల్ని సాధించవచ్చు. ఇవికాక విధి, సంప్రార్థనాద్యర్థక వాక్యాలు కూడా ఉన్నై. ఒక వాక్యానికి కిల, సంబుద్ధ్యార్థక ప్రత్యయాలు చేర్చటంవల్ల సామాన్య వాక్యంలో మరికొన్ని అర్థభేదాలేర్పడతై." "... క్రియా రహిత వాక్యాల్లో కొన్ని సహజంగా క్రియలేని వాక్యాలు, మరికొన్ని క్రియ లోపించిన వాక్యాలు ఉంటై. సహజంగా క్రియలేని వాక్యాల్లో రెండు నామబంధాలుంటై. అందులో ఒకటి ఉద్దేశ్యం. ఇంకోటి విధేయం. ఉద్దేశ్య విధేయనామాలు రెండూ ఏకవస్తు భోధకాలు. ఉద్దేశ్య నామాలు ఏ నామాలైనా కావచ్చు. సర్వనామాలు కూడా కావచ్చు. విధేయనామాలు సిద్ధనామాలు, విశేషాలనుంచి సాధించిన నామాలు ఉంటై. విధేయ నామాలు ఉద్దేశ్య నామాల్ని గురించి సాధారణంగా ఏదో ఒక విశేషాన్ని

బోధిస్తై. ఉద్దేశ్య, విధేయ నామాలు రెండూ విశేషణపద పూర్వకమై ఉండవచ్చు. ఈ విశేషణాలలో వాటిల్లో భేదాల్నిబట్టి వాటిక్రమం ఉంటుంది. ... ఇట్లాంటి వాటిని సమానాధికరణ వాక్యాలనిగాని, సమీకరణ వాక్యాలని (equational clauses) గాని అంటారు." అని వివరించారు.

"నీవు ధన్యుఁడవు" (1:3810)

"వనజాక్షి ప్రణయ పూర్వకముగాఁ బలికె" (2:2942)

## 6.2.2 సంశ్లిష్ట వాక్యం (complex sentence)

"ఒక ప్రధాన వాక్యానికి కొన్ని ఉపవాక్యాలు చేరడంవల్ల సంశ్లిష్ట వాక్యాలు ఏర్పడుతై. సంశ్లిష్ట వాక్యాల్లో ప్రధాన వాక్యం క్రియా సహితమైతే ఒకటికన్న ఎక్కువ క్రియలను గుర్తు పట్టవచ్చు. ఉపవాక్యాల్లో క్రియ సాధారణంగా అసమాపక క్రియ అయి ఉంటుంది. మరికొన్నిటిలో క్రియ భావార్థక నామంగాగాని, క్రియా జన్య విశేషణంగా కాని ఉంటుంది. ఈ చెప్పిన క్రియా రూపాల్లో పురుషబోధ ఉండదు. అసమాపక క్రియల్లో అయినా, వ్యాపారం జరిగే తీరును గురించే ఉంటుంది. కాలబోధ ఉంటుంది. కాలబోధ ప్రధాన క్రియను అనుసరించి ఉంటుంది. క్రియా జన్య విశేషణంలో కాలబోధ ఉంటుంది. క్రియలన్నింటికీ వ్యతిరేక రూపాలు కూడా ఉంటై."

(చూ. రామారావు, 2002:24)

ఉపవాక్యాల్లో రాదగ్గ అసమాపక క్రియా రూపాలు కింద చూపబడ్డాయి. (వీటిపై చర్చ నాలుగో అధ్యాయంలో కూడా ఉంది.)

(i) క్త్వార్థకం

(ii) వ్యతిరేక క్త్వార్థకం

(iii) శత్రర్థకం

(iv) అన్నంతం

(v) చేదర్థకం

(vi) అప్యర్థకం

### 6.2.2.1 క్త్వార్థక ప్రయుక్త సంశ్లిష్ట వాక్యాలు

క్త్వార్థకం అంటే భూతకాలిక అసమాపక క్రియ. ఇది వాక్యంలో ప్రధాన క్రియకు ముందు ఉండి, ప్రధాన క్రియా వ్యాపారానికి ముందు జరిగిన వ్యాపారాన్ని తెలుపుతుంది. ఆధునిక

తెలుగులో హేతు, రీత్యర్థాల్లోనూ, కాల బోధక సామాన్యవాక్యానికి ఉపవాక్యంగా, జడవాచక కర్తృపదాల్లో పరిణామ సూచకంగా, కాలబోధంగా "క్త్వార్థకం" ప్రయుక్తమవుతుందని గుర్తించినవారు రామారావు (1979:390).

శ్రీరామాయణం కావ్యంలో క్త్వార్థక ప్రయుక్త సంశ్లిష్ట వాక్యాలు కింద విధంగా ఉన్నాయి.

ఉదా.

(i) "అ(న)తని మాటలువిని యలఁతి నవ్వొలయ
క్రతు రక్షణార్థియౌ గాధేయుఁ డనియె." (1:1897, 98)

(ii) "భగ్గున మండిన పావకురీతి
దిగ్గున లేచి గాధేయుఁ డిట్లనియె" (1:1937, 38)

(iii) "అర్థ యోజన మాత్ర మరిగి రాజన్య
మూర్థన్యుతోడ నమ్ముని యిట్టులనియె." (1:2047, 48)

(iv) "... అమ్మంత్ర యుగము
విని వారు నేర్చి భావించి కౌశకుని
గురినిఁగానాత్మఁ గైకొని సేయవలయు
పరమ శిష్య విధాన పరిచర్య చేసి
రామచంద్రుండు శరత్కాలతపన
రమణీయక మహా రాశియై మించె." (1:2067-71)

(v) "... మహా సరోవరము
జాలెత్తి ప్రవహించి సరయువై మించె." (1:2142,43)

## 6.2.2.2 వ్యతిరేక క్త్వార్థకం ప్రయుక్తమైన సంశ్లిష్ట వాక్యాలు

ఉదా.

(i) "...నినుఁ బెండ్లి యాడక మున్ను
నసమాన దివ్య శస్త్రాస్త్ర వర్గమున
నెసఁగుచు విధిచైద మిటులున్న కతన

ప్రాప్తమైనట్టి మహా శాపమొకటి
గుప్తంబుచేసి వాకొన నైతి మున్ను
ననుభవింపఁగ దరియయ్యె...బలికె." (2:6092-102)

(ii) "...అట్టిట్టు వోవలేకఁ
జొరఁ బారె జడిసి పక్షులు కులాయముల
సెలయేఱులను మీరు శిఖరులరీతి
బొలిచె; గజంబులంబు ప్రవాహముల
వామలూరులు వచ్చు వ్యాళంబు లనఁగ
భూమీధ్ర గుహల నంబు ఝరంబు లుబ్బె." (2:6117-22)

(iii) "అధికార మెఱఁగక యెవని యాసించు
నధముని రాజని యందురే జనులు?" (2:9580)

## 6.2.2.3 శత్రర్థకం ప్రయుక్తమైన సంశ్లిష్ట వాక్యాలు

ఉదా.

(i) "... చిల్విషమును జేయుచుఁ గోఁతి
యూరెల్ల గాలిచి యూరకే చనియె" (6:453, 54)

(ii) "...తేఱి చూచుచును
చెదఱుఁ గుత్తుక తోడ సీతావరుండు
మది చిక్కఁబట్టి తామఱియు నిట్లనియె" (2:2738-40)

(iii) "... జానకి నుంచి చనుచున్న యపుడు
ఆ రమణీమణి యాత్మఁ జింతించి
శ్రీరామ చంద్రు నీక్షించి యిట్లనియె." (3:572-74)

## 6.2.2.4 అన్నంత రూపం ప్రయుక్తమైన సంశ్లిష్ట వాక్యాలు

ఉదా.

(i) "... మునులెల్ల నిది కార్య-ముగ నెలయించి ...

(ii) "తలఁప నేమిటికింకఁ దడరక నన్ను

(iii) "జనకునిఁజూచి ద-శరథభూజాని
వినయ గౌరవములు వెలయ నిట్లనియె" (1:5227,28)

## 6.2.2.5 చేదర్థకం ప్రయుక్తమైన సంశ్లిష్ట వాక్యాలు

ఉదా.

(i) "నీ కుమారాఖ్యాన మెవ్వరు వినిన
శ్రీకరులై శుభ శ్రీలనొందుదురు." (1:3021, 22)

(ii) "ప్రచుర భక్తిని మదిఁ బాటించి వినినఁ
జదివిన వ్రాసిన సభలఁ బేర్కొనిన
మదిఁ దలంచిన నెట్టి మనుజులకైన ...

(iii) "కురియింతు వానలు కోరినయపుడు
భరియింతు సకల భూ భారంబు నేను" (3:4097, 98)

## 6.2.2.6 అప్యర్థకం ప్రయుక్తమైన సంశ్లిష్ట వాక్యాలు

ఉదా.

(i) "పగవానితోనైన పాముతోనైన
తగఁ జెల్మి చేసినఁ దరియింపవచ్చు" (6:1295, 96)

(ii) "హనుమంతుఁడెంత వెదకినను సీతనుఁ గానక మిక్కిలి చింతిల్లుట" (5:1146తర్వాతివచనం)

(iii) "...విలపించు కామినీమణులఁ
జూచి మిక్కిలి రాజు శోకవారాశి
వీచులంబడి దరివెదకిన లేక
ఆపన్నుడై యుండె..." (2:4416-18)

## 6.2.3 సంయుక్త వాక్యం (compound sentence)

"కొన్ని సమాన ప్రతిపత్తిగల వాక్యాలు కలిసి ఒక వాక్యంగా ఏర్పడితే సంయుక్త వాక్య మవుతుంది. వాక్య సంయోగాన్ని సూచించటానికి ఇంగ్లీషులో and, or, but వంటి శబ్దాలను హిందీలో ఔర్, యా, మగర్‌వంటి శబ్దాలనూ ప్రయోగిస్తారు. ఈ శబ్దాలు వాక్య సంయోగాన్నే కాక పద, పదబంధ సంయోగాన్ని కూడా సూచిస్తాయి. తెలుగులో అన్నోచోట్లా ఇంట్లాంటి శబ్ద ప్రయోగాం లేదు."

"తెలుగులో రెండు వాక్యాలను ఒకదాని తరవాత ఒకటి ప్రయోగించి వాటి మధ్య సంబంధాలు అర్థాన్నిబట్టి గ్రహిస్తాం." "తెలుగులో సంయుక్త వాక్యాలకూ, అసంయుక్త వాక్యాలకూ భేదం స్వల్పం. సంకలనార్థంలో క్త్వార్థక వాక్యాలే సంయుక్త వాక్య ప్రయోజనంలో ప్రవర్తిస్తై."

(చూ. రామారావు, 2002:83-91)

రెండు వాక్యాలను ఒకదాని తరవాత ఒకటి ప్రయోగించేపుడు (సంయుక్త వాక్యంలో) ఆ వాక్యంలో కనిష్ఠంగా రెండు (గరిష్ఠంగా ఎన్నైనా) సమాపక క్రియలు ఉండాలి.

కాబట్టి సంయుక్త వాక్యం కింద తెలిపిన విధంగాకూడా ఏర్పడే వీలుంది.

(i) సంయుక్త వాక్యం కనిష్ఠంగా రెండు (గరిష్ఠంగా ఎన్నైనా) సామాన్యవాక్యాల కలయికవల్లగానీ,

(ii) కనిష్ఠంగా రెండు (గరిష్ఠంగా ఎన్నైనా) సంశ్లిష్ఠ వాక్యాలతో కూడిగానీ,

(iii) సామాన్య , సంశ్లిష్ఠ వాక్యాలు కలిసిగానీ సంయుక్త వాక్యాలు ఏర్పడవచ్చు.

ఉదా.

(1) శ్రీకర భోగీంద్ర శిఖరవిహారి
(2) లోక రక్షణ కళాలోక ప్రచారి
(3) కలశాంబునిధి రాజ కన్యావినోది
(4) అలఘు సత్త్వవిహంగ హయవరసాది
(5) వేదవేదాంతార్థ విద్యానువాది
(6) ఆది మధ్యాంతక్రి యాపరిచ్ఛేది

(7) నవరత్న మయభూషణ విభా విభాసి
(8) రవి కోటి సంకాశ రమ్య విభాసి
(9) సకలకల్యాణరా జద్గుణాకరుఁడు
(10) వికచాబ్జ నయనుండు వేంకటేశ్వరుఁడు
(11) ధారుణి పారిజాతంబు మాకెపుడు
(12) కోరికలెల్లఁ జేకూరుచుంగాఁత. (1:1-12)

పై ద్విపద పాద పంక్తులలో పన్నెండు సామాన్య వాక్యాలున్నాయి. ఇవి అన్నీ ఒకే ఉద్దేశ్య నామంతో అన్వయిస్తున్నాయి. కనుక దీనిని సంయుక్త వాక్యంగా గ్రహించాలి.

# 6.3 స్వభావ విభాగం

ఈ విభాగంలో ప్రశ్నార్థక, ఆశ్చర్యార్థక, ఉభయ సంప్రార్థన, సందేహార్థక, నిశ్చయార్థక, సంబోధనార్థక వాక్యాలు ఉదాహరణ పూర్వకంగా చర్చించబడ్డాయి.

## 6.3.1 ప్రశ్నార్థక వాక్యం

ప్రశ్నార్థక వాక్యం విషయాపేక్షక, విషయ నిర్ధారక భేదాలతో రెండు రకాలు.
(చూ. రామారావు. 2002:60)

### 6.3.1.1 విషయాపేక్షక ప్రశ్నలు

విషయాపేక్షక ప్రశ్నలు నూతన విషయ వాక్యాలను అపేక్షిస్తాయి. ఆధునిక తెలుగులో ఇటువంటి వాక్యాల్లో సాధారణంగా ఎవరు, ఎక్కడ, ఎప్పుడు, ఎందుకు, ఎట్లా, మొదలైన ప్రశ్నార్థక సర్వనామాలు ఉంటాయి. కావ్య భాషలో ఇవి ఎవ్వఁడు/ఎవ్వాడు, ఎవ్వని/ఎవ్వాని, ఎవ్వనిన్/ఎవ్వానిన్, ఎవ్వతె, ఎద్ది/ఏది/ఎయ్యది, ఎవ్వరు/ఎవ్వారు, ఎవ్వరి/ఎవ్వారి... మొదలైన రూపాల్లో కనిపిస్తాయి. (చూ.3.8.1.4)

ఉదా.

(i) "...ఎవ్వడు బోధించె నీ బుద్ధి నీకు?" (3:3355)

(ii) "... అందు నెవ్వతె నెవ్వఁడీక్షించె" (2:8478)

(iii) "... మీకు నెద్ది సాధకము?" (2:9748)

(iv) "రాముడు సేయు నేరము నీకు నెద్ది?" (3:4313)

(v) "ఎందువోవుదు మింక నెవ్వారు దిక్కు?" (3:5239)

## 6.3.1.2 విషయ నిర్ధారక ప్రశ్నలు

వాక్యానికి ప్రశ్నార్థక పదకల్పకావ్యయాలైన -ఆ, -ఎ/-ఏలు చేరి (చూ. 5.3) విషయ నిర్ధారక ప్రశ్నలు ఏర్పడతాయి. ఈ విధమైన ప్రశ్నలకు సమాధానం అవును/కాదు రూపంలో ఉంటుంది. సాధారణంగా ఇవి క్రియారహిత వాక్యాలై ఉంటాయి.

ఉదా.

(i) "... అందరికిని సేమమా?" (6:1131)

(ii) "... మనరామునకు సౌఖ్యమా? (1:1980)

(iii) "... యిన్ని హెచ్చు గుణంబులెందైన గలవె?" (1:244)

(iv) "సామంతులెపుడు చనువు గోరుదురె?" (1:1777)

(v) "నాకుఁ గల్గి యుపేక్ష నాయమే? సేయ?" (1:974)

(vi) "... సేమమే? నిన్నుఁ గొల్చిన రాజులకును" (1:3867)

## 6.3.2 ఆశ్చర్యార్థక వాక్యం

ఆశ్చర్యభావాన్ని వ్యక్తంచేసే వాక్యాలను ఆశ్చర్యార్థక వాక్యాలంటారు. సాధారణంగా ఔర!, ఔరౌర!, భళిరే!వంటి శబ్దాలు ఈ వాక్యాలలో ఉంటాయి.

ఉదా.

(i) "ఔర! వీఁడెవ్వఁడో!" యన విభీషనుని
శ్రీరామచంద్రుఁడీక్షించి యిట్లనియె" (6:7007, 08)

(ii) "ఔరౌర! యని మెచ్చి రమరులు మింటఁజేరి...

(iii) "భళిరే! యని విశ్వమంతయును...

## 6.3.3 ఉభయసంప్రార్థన వాక్యం

ఉభయ సంప్రార్థనవాక్యాల్లో కర్త స్థానంలో 'మనము' వస్తుంది. (చూ. 4.3.1.1.1)

ఉదా.

(i) "యీ పొద్దు కిచ్చోటనే యుండి మనము
రేపు పోవుదము" (1:2361, 62)

(ii) "త(ద)లపడి ద్వంద్వ యుద్ధంబు సేయుదము" (1:5578)

## 6.3.4 సందేహార్థక వాక్యం

-ఒ/-ఓ అనే సందేహార్థక పదకల్పకావ్యయాలు చేరిన వాక్యాలు సందేహార్థక వాక్యాలుగా ప్రవర్తిస్తాయి. (చూ.5.4)

ఉదా.

(i) "... విహరించె నేమిగాఁగలదొ?" (1:5530)

(ii) "... ఏ ముని శేఖరుండిందున్నవాఁడో?" (2:5433)

## 6.3.5 నిశ్చయార్థక వాక్యం

స్థిర నిర్ణయాన్ని తెలపడం నిశ్చయార్థక వాక్యంలో కనిపిస్తుంది.

(i) "విదరింపఁ జేయుదు విదరించి నీదు
మెదడుచే దనియింతు మృగ ధూర్తములను" (6:9881, 82)

## 6.3.6 సంబోధనార్థక వాక్యం

సంబోధనలో 'ఓ'అనే శబ్దం వస్తుందని బాలవ్యాకర్త ("ఓ యా మంత్రణంబునం దగు" (బాలవ్యా. తత్సమ.:14)) సూత్రించాడు. ఇది సంబోధ్య వాచకానికి ముందే ప్రయోగించ బడుతుంది.

ఉదా.

(i) "ఓ మునీశ్వర! నీకు నొనరింతు నతులు." (1:2663)